క్లుప్తంగా

3న పాలిసెట్ స్పాట్ అడ్మిషన్లు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో అక్టోబర్ 3వ తేదీన పాలిసెట్ స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ నాగేశ్వర రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అడ్మిషన్లకు పాలిసెట్ రాసి మొదటి, రెండో విడత కౌన్సెలింగ్‌లో సీట్లు రాని వారు, పదో తరగతి ఉత్తీర్ణులై పాలిసెట్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. చేరదలిచిన విద్యార్థులు శనివారం లోపు పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తులు అందించాలని ఆయన సూచించారు.

సత్యదేవుని కరుణ అందరిపై ఉండాలి

సీటీఆర్ఐ: కోరిన వరములిచ్చే భగవంతుడు శ్రీ సత్యనారాయణ స్వామి అని..ఆ స్వామివారికి సామూహికంగా వ్రతాలు ఆచరించడం సంతోషకరమని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్యాపురం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహించిన సత్యదేవుని సామూహిక వ్రత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేవస్థానం చైర్ పర్సన్ దుంగా మంగ, పాలకవర్గ సభ్యుల పర్యవేక్షణలో ఈ వ్రతాలను దేవదాయ శాఖ నిర్వహించింది.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రకాశం నగర్ : ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అర్బన్ పరిధిలో ఉన్న ఐదు అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుబ్బారావుపేట-2, ఆర్యాపురం -2, ఆనంద్‌నగర్ సొసైటీ, తుమ్మలావ -3, సైక్లోన్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన దరఖాస్తులను అక్టోబర్ 4 వరకు ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ రాజమహేంద్రవరం అర్బన్ కార్యాలయంలో స్వీకరించనున్నట్లు తెలిపారు

లక్ష పసుపు కొమ్ముల నోము

సీటీఆర్ఐ: మహిళలంతా సౌభాగ్యంతో, ముత్తైదువులుగా ఉండాలని కోరుకొంటూ మహిళలు లక్ష పసుపు కొమ్ములు నోము చేశారు. శుక్రవారం స్థానిక గోదావరి గట్టున గల శ్రీ ఉమా మార్కండేయేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీమార్కండేయ లలితా మండలి సభ్యులు లక్ష కుంకుమార్చన, లక్ష పసుపు కొమ్ములు నోము నోచుకున్నారు.

వేంకటేశ్వరస్వామి వారి హుండీ ఆదాయం రూ.2.98 లక్షలు

ధవళేశ్వరం: ధవళేశ్వరం వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం హుండీ ఆదాయం గడిచిన ఆరు నెలలకు రూ.2,98,032 వచ్చింది. శుక్రవారం దేవస్థానం అధికారుల సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ సాధనాల చంద్రశేఖర్ (శివ), మాదాసు తులసీరామ్, విజయమ్మ భక్త బృందం సభ్యులు, గొల్లపేట రామాలయం భక్త బృందం సభ్యులు, దేవదాయ,ధర్మాదాయ శాఖ అధికారులు ఎం.రమణమ్మ, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.నాగసురేష్ పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శి సేవలు ప్రశంసనీయం

కడియం: మండలంలోని వేమగిరి సచివాలయం-3 కార్యదర్శి లక్ష్మీకుమారి సేవలు ప్రశంసనీయమని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. వేమగిరి నుంచి విశాఖ జిల్లాకు బదిలీపై వెళుతున్న లక్ష్మీకుమారికి శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వీడ్కోలు సత్కారం చేశారు. శాలువాలతో సత్కరించి చిరు కానుక అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ జక్కంపూడి నగర్‌లో సమస్యల పరిష్కారానికి, ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడానికి లక్ష్మీకుమారి చేసిన సేవలు ఎనలేనివి అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

డీపీవో కార్యాలయాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయాన్ని జిల్లా ట్రైనీ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఆయన శిక్షణలో భాగంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా జరుగుతున్న పనులను పర్యవేక్షించారు.

నేటి నుంచి జాతీయ నృత్య ఆరాధనోత్సవాలు

ప్రకాశం నగర్ : స్వర మహతి కళా పరిషత్ ఆధ్వర్యంలో శని, ఆదివారం రెండు రోజుల పాటు ప్రతిష్టాత్మక జాతీయ నృత్య ఉత్సవం, భరత ముని ఆరాధనోత్సవములు-2023 ను స్థానిక ఆనం కళా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు ఆదిత్య కిరణ్ తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణకు సిద్ధం

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వ ఆదేశాలతో శనివారం నుంచి నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణకు సర్వం సిద్ధమైందని కమిషనరు కె.దినేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నారాయణపురంలోని వైఎస్సార్ నగర ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి శిబిరానికి విచ్చేసిన వారికి పరీక్షల నిర్వహణలపై సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అదనపు కమిషనరు, పీఎం.సత్యవేణి, మున్సిపల్ హెల్త్ అధికారి డాక్టర్ ఎ.వినూత్న పాల్గొన్నారు.

కరాటేలో పతకాల పంట

- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారులు
- అండర్ 10 నుంచి అండర్ 22 విభాగాల్లో సత్తా చాటిన వైనం



విజేతలను అభినందిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్, ఇతర అధికారులు

ప్రకాశం నగర్ : కరాటేలో విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించి పలు పతకాలు సాధిస్తున్నారు. ఆత్మరక్షణ కోసం కొందరు, హాబీగా కొందరు ఈ విద్య నేర్చుకుంటున్నారు. కరాటేలోని సెల్ఫ్ టెక్నిక్స్ విభాగంలో పలు మెళకువలు నేర్చుకుంటున్న వీరు ప్రత్యర్థిని మట్టి కరిపించే రీతిలో శిక్షణ తీసుకుంటున్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో కరాటే వంటి శిక్షణలు వారిలోని ఆత్మస్థైర్యాన్ని పెంచడంతో పాటు ఆపదలో అదుకునే విధంగా ఉంటాయని శిక్షకులు చెబుతున్నారు. ఐతే మిగిలిన క్రీడలతో పోలిస్తే కఠోరమైన శిక్షణ, ఏకాగ్రత, క్రమశిక్షణతో కూడుకున్న ఈ విద్యల్లో రాణించడం అంత సులభం కాదని క్రీడా విశ్లేషకులు అంటున్నారు.

పలు పతకాలు కైవసం

ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో అండర్ -10 నుంచి అండర్- 22 విభాగాల్లో వివిధ స్పేరింగ్ కేటగిరిలలోను, కేరళలో సౌత్ ఇండియన్ కరాటే ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లోనూ నగరానికి చెందిన ఎం.సూర్య అభిశ్రీ, మోక్షిత యాదవ్, వెంకట కావ్యశ్రీ, పి.పూజ, బి.కీర్తన, ఎస్.శ్రీలక్ష్మి లత, వి.వెంకట కిరణ్మయి, జి.లక్ష్మి సంధ్య, కె.లక్ష్మిభవానీ, ఆర్. అఖిల, ఎల్.వైష్ణవీ, ఎస్.శరణ్య, పి. శ్రీవిద్య, కె.జోక్యాస్, ఎస్.మనోహర్, ఎం.వెంకట నరేంద్ర బంగారం, వెండి, కాంస్య పతకాలు సాధించారు. విజేతలను నగరపాలక సంస్థ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ కె.దినేష్‌కుమార్, అధికారులు క్రీడాకారులను అభినందించారు.

బాలికలదే పైచేయి

కరాటే పోటీల్లో విజేతలు అధిక శాతం బాలికలు కావడం విశేషం. పోటీల్లో మొత్తం 16 మంది విజేతలుగా నిలువగా, వీరిలో 14 మంది బాలికలు, ఇద్దరు బాలురు ఉన్నారు. వీరందరూ ఆయా పాఠశాలల్లో చదువుకుంటూనే కరాటేలో శిక్షణ పొందుతున్నారు. చదువుతో పాటు కరాటేలోనూ మంచి ప్రతిభ కనబరిచి ఆయా పోటీల్లో పతకాలు సాధించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

ఎమ్మెల్యే రాజా అభినందనలు

కేరళలో సౌత్ ఇండియన్ కరాటే ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో తాళం తాత్వశ్రీ వెండి పతకం సాధించింది. అదేవిధంగా విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర కరాటే పోటీలో తాళం కార్తీక్ కాంస్య పతకం సాధించాడు. విజేతలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అభినందించారు. వీరు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కోచ్ మధు రామకృష్ణను అభినందించారు.

మంచి భవిష్యత్ ఉంటుంది



కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు స్పోర్ట్ కోటాలో మంచి ఉద్యోగాలు సాధించవచ్చు. వారికి మంచి భవిష్యత్ ఉంటుంది. సుమారు 120 మంది నా వద్ద శిక్షణ తీసుకుంటున్నారు. కరాటేతో శారీరక ధృడత్వంతో పాటు, మనోధైర్యం కలుగుతుంది. గతంతో పోలిస్తే ఇప్పుడు అన్ని విభాగాల్లోను బాలుర కంటే బాలికలే ముందంజలో ఉన్నారు.

– పిల్లి అరుణ్‌కుమార్ (కరాటే మాస్టర్)

ఆనందంగా ఉంది



సౌత్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో వెండి పతకం గెలవడం ఆనందంగా ఉంది. మా కోచ్ మధు రామ కృష్ణ మంచి శిక్షణ ఇస్తున్నారు. భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించేందుకు కరాటేలో శిక్షణ తీసుకుంటున్నాను.

– తాళం తాత్వశ్రీ

ప్రజలతో మమేకం కావాలి



నాయకులతో సమీక్ష నిర్వహిస్తున్న సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ శ్రేణులంతా నిరంతరం ప్రజలతో మమేకమయ్యే విధంగా పార్టీ ఇచ్చిన కార్యక్రమాల ప్రకారం పనిచేసి విజయవంతం అయ్యేలా కృషి చేయాలని సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం స్థానిక తిలక్ రోడ్‌లోని పార్టీ నగర కార్యాలయంలో క్లస్టర్ ఇన్చార్జిలు, క్లస్టర్ ప్రెసిడెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన కార్యక్రమాలు క్షేత్రస్థాయికి తీసుకుని వెళ్లేందుకు ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలను ప్రతీ ఒక్కరూ పాటించాలన్నారు. సంక్షేమ పథకాల అమలును ప్రతి ఒక్కరికీ గుర్తు చేసేలా కార్యకర్తలు, నాయకులు నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ నాయకులు బర్రే కొండబాబు, పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, అర్జరపు వాసు పాల్గొన్నారు.

గుండె వ్యాధులు చిన్నారులనూ కబళిస్తున్నాయి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లక్ష్మణ్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): గుండె వ్యాధులు గతంలో 40 ఏళ్లు దాటిన తర్వాత వచ్చేవని, నేడు మారిన జీవన విధానంతో చిన్న పిల్లలు సైతం దీని బారిన పడుతున్నారని కిమ్స్ బొల్లినేని గుండె వైద్యులు డాక్టర్ కొల్లు లక్ష్మణ్ పేర్కొన్నారు. స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ గుండె దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. దీనికి హాజరైన వైద్యులు లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా చూస్తే భారతదేశంలో గుండె జబ్బుల బారిన పడుతున్న వారి సంఖ్య చాలా అధికంగా ఉందన్నారు. అనంతరం ఆయన గుండెపోటు వచ్చినప్పుడు ప్రాణాన్ని కాపాడే సీపీఆర్ విధానాన్ని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి మాట్లాడుతూ ప్రస్తుతం గుండెపోటుతో చనిపోయే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, మంచి ఆహారపు అలవాట్లు,శారీరక వ్యాయామం తప్పనిసరని తెలియజేశారు. గుండె వ్యాధులపై అవగాహన కల్పించి మెళకువలు నేర్పిన డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ పి.రాగోకుమారిలను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగాధిపతి సీహెచ్. ప్రియాంక, జి.దివ్యశ్రీ, డాక్టర్ పీఎస్‌హెచ్‌పీ.దీపిక రాణి, ఎమ్.కాస్మ పాల్గొన్నారు.

మేరా మట్టి మేరా దేశ్ ర్యాలీలు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఐ దిలీప్‌కుమార్

కంబాలచెరువు: మేరా మట్టి...మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం అర్బన్ రేంజ్‌లో వివిధ పాఠశాలల్లో శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. నాగరాజా ప్రాథమిక పాఠశాల, కుసుమ నాగన్న ప్రాథమిక పాఠశాల, కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాల, లాలాచెరువు ఉన్నత పాఠశాల, శ్యామలాంబ ప్రాథమికోన్నత పాఠశాల ల నుంచి మేరా మట్టి మేరా దేశ్ కలశాలను అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్‌కి అందజేశారు. కార్యక్రమంలో అర్బన్ ఎంఈవో 2 రమా రజని, ప్రధానోపాధ్యాయులు మోటూరి మంగారాణి, సేవా రాజ్యలక్ష్మి, సీఆర్పీలు జయంతి శాస్త్రి, జె శ్రీనివాసరావు, పబ్బినీడి ప్రసాద్, నాగలక్ష్మి, కోటేశ్వరి, ఇందిర పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం తేవాలి

కంబాలచెరువు: సమాజ పరిరక్షణలో భాగస్వాములైన న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని, తక్షణం కేంద్ర ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు పేర్కొన్నారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను కోరుతూ అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం దేవిచౌక్ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. సొసైటీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బీర అరుణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ లేకుంటే సమాజ మనుగడ సాధ్యం కాదన్నారు. సీనియర్ న్యాయవాదులు సోమిన రామకృష్ణ, అల్లంకి శివప్రసాద్, మల్లిమొగ్గల చిన్నిబాబు, దీపాటి శ్యాంబాబు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకున్న జక్కంపూడి ఫౌండేషన్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): అతి అరుదుగా లభించే ఓ పాజిటివ్ బొంబాయి బెనటీన్ రక్తాన్ని పంపి వైఎస్సార్, జక్కంపూడి రామ్మోహన రావు బ్లడ్ ఫౌండేషన్ పాట్నాలో లుకేమియా వ్యాధితో పోరాడుతున్న బాలిక ప్రాణాన్ని కాపాడింది. దీనికి సంబంధించి ఫౌండేషన్ శుక్రవారం తెలిపిన వివరాలిలావున్నాయి. పాట్నాకు చెందిన 14 ఏళ్ళ ఆలీషా ప్రవీణ లుకేమియాతో బాధపడుతోంది. ఆమెది ప్రపంచం లో అత్యంత అరుదైన ఓ పాజిటివ్ బొంబాయి బెనెటీస్ గ్రూపు. ఆ రక్తం దేశంలో ఎక్కడా దొరక్కపోవడంతో శాంతి బ్లడ్ సర్వీస్ ఆర్గనైజర్ ద్వారా రాజమహేంద్రవరంలో ఉన్న జక్కంపూడి రామ్మోహన రావు ఫౌండేషన్‌ను సంప్రదించారు. దీంతో వెంటనే స్పందించిన ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ, జాగృతి నాగేశ్వరరావు, ట్రస్టీ పట్నాయక్ ఆ బ్లడ్ గ్రూప్ రక్తాన్ని తమ వ్యక్తిగత సిబ్బందితో ద్వారా పాట్నాకు పంపించారు.

నగరంలో అన్నీ సీసీ రోడ్లే

- ఎంపీ భరత్‌రామ్
- వారం రోజుల్లో అభివృద్ధి చేసిన కంబాల చెరువు పార్కు ఓపెనింగ్



శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: నగర వ్యాప్తంగా అన్ని డివిజన్లలో పాడైన అంతర్గత రహదారులన్నింటినీ సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామని ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని 28వ డివిజన్ స్టేడియం రోడ్డు కొబ్బరి కాయల మార్కెట్ వద్ద 28, 29, 31, 36 డివిజన్లకు సంబంధించి ఇంటర్నల్ రోడ్ల అభివృద్ధి పనులకు ఎంపీ భరత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రూ.2 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశామన్నారు. మరో నాలుగు డివిజన్‌లలో సీసీ రోడ్లను రూ.1.68 కోట్లతో అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పనులు శరవేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వారం రోజుల్లో కంబాలచెరువు పార్కు అభివృద్ధి పనులు పూర్తి కాబోతున్నాయని ఫౌంటెన్ మూవీలు, మ్యూజిక్ ఫౌంటైన్లతో సర్వాంగ సుందరంగా ముస్తాబై నగర వాసులకు ఆహ్లాదాన్ని, వినోదాన్ని కలిగించబోతోందని తెలిపారు.

రూ.2వేల కోట్ల స్కామ్‌పై విచారణ జరగాలి

టీడీపీ చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్న హయాంలో 2015 గోదావరి పుష్కరాలకు విడుదలైన ప్రత్యేక నిధులు రూ.2 వేల కోట్లతో ఏమి అభివృద్ధి చేశారో ఎక్కడా కనిపించడం లేదన్నారు. స్కిల్ స్కామ్ మాదిరిగా పుష్కర నిధులు రూ.2 వేల కోట్లపై సమగ్ర విచారణ చేస్తే అక్రమార్కుల గుట్టు బయటపడుతుందన్నారు. నగరంలో నిధులన్నీ కార్పొరేటర్లు, నాయకులు మూకుమ్మడిగా దిగమింగేశారని, కాంట్రాక్టర్ల నుంచి 2 శాతం కమీషన్లు లాక్కుంటే కానీ టీడీపీ నేతల పనులు చేయనిచ్చేవారు కాదన్నారు. గత టీడీపీ హయాంలో రాజమహేంద్రవరం నగరం ..వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాజమహేంద్రవరం నగరానికి ఉన్న తేడా చూసి ప్రతిపక్ష నేతలే విస్మయం వ్యక్తం చేస్తున్నారన్నారు. సెంట్రల్ జైలు రోడ్డు హైదరాబాదు జూబ్లీ హిల్స్, బంజారాహిల్స్ మాదిరిగా అందాలతో కనువిందు చేస్తోందన్నారు. గోదావరి గట్టు హైదరాబాదు టాంక్ బండ్ మాదిరిగా మొత్తం మారబోతోందని తెలిపారు. రోడ్డు కం రైలు వంతెనపై రోడ్డును పాత 30ఎంఎం తారు రోడ్డు పూర్తిగా తొలగించి.. కొత్తగా అభివృద్ధి చేస్తున్నామని, నెల రోజుల్లో ఆ పనులు కూడా పూర్తవుతాయన్నారు. వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రూరల్ అబ్జర్వర్ పీకే రావు, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, రూరల్ డివిజన్స్ అధ్యక్షుడు మింది నాగేంద్ర, పాలిక శ్రీను 28వ డివిజన్ ఇన్‌చార్జి బిల్డర్ చిన్న పాల్గొన్నారు.

'భయమేస్తోంది కాస్త పోలీసులకు చెప్పండయ్యా'

చీకటి పడుతుంటే భయమేస్తోంది. ఒకవైపు దొంగలు, మరో వైపు బ్లేడ్ బ్యాచ్ హల్ చల్ చేస్తున్నాయి. కాస్త పోలీసులకు చెప్పండయ్యా అంటూ 28వ డివిజన్ కొత్తపేట రామాలయం వీధికి చెందిన మహిళలు ఎంపీ భరత్‌రామ్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం రూ.2 లక్షలు విలువజేసే బైక్ అపహరించుకుపోయారని ఈ మధ్య కాలంలో బైక్ దొంగల బెడద ఎక్కువగా ఉందన్నారు. దీంతో అక్కడే ఉన్న పోలీసు అధికారులకు రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహించమని ఎంపీ ఆదేశించారు.

ఫోల్డర్, బ్యాగులు సరఫరాకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన ఫోల్డర్, బ్యాగులు సరఫరా చేయడానికి ఆసక్తి గల ఏజెన్సీల నుంచి దరఖాస్తులను సమర్పించడానికి ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ కె. వేంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జేఏఎస్ నోడల్ అధికారి 8143119111 ఫోన్ నంబరులో సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని తెలియజేశారు. పూర్తి చేసిన దరఖాస్తులు శనివారం సాయంత్రం 5గంటల వరకు స్వీకరిస్తామన్నారు.

ఆర్ట్స్ కళాశాల యూజీ పరీక్ష ఫలితాలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఆర్ట్స్ కళాశాల యూజీ ఫలితాలు విడుదలయ్యాయి. ఆ వివరాలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు శుక్రవారం వెల్లడించారు. బీఏలో 91 శాతం, బీకాం 95.10 శాతం, బీబీఏలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ ఏడాది ఫలితాలు మరింత వృద్ధి చెందాయన్నారు.

రైతునేస్తం పథకాన్ని వినియోగించుకోవాలి



రుణాల చెక్కును అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ వీర్రాజు

రాజమహేంద్రవరం రూరల్: ఈఏడాది నుంచి నూతనంగా ప్రవేశపెట్టిన రైతు నేస్తం పథకం ద్వారా రైతులకు ఎకరానికి రూ.8లక్షలు రుణం ఇస్తామని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తూర్పుగోదావరిజిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. శుక్రవారం తొర్రేడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(సొసైటీ) మహాజన సభ సమావేశం చైర్‌పర్సన్ చిట్టూరి వెంకటరావు అధ్యక్షతన జరిగింది. ఈసభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆకుల సొసైటీ ద్వారా మంజూరైన రైతునేస్తం రుణాలు ఐదుగురికి రూ.38.41లక్షలు, జాయింట్ లైబిలిటిగ్రూప్‌లకు రూ.4.25లక్షలు పంపిణీ చేశారు. సంఘ సీఈవో కొడవలి వీరవెంకట సత్యనారాయణ, డీసీసీబీ బ్రాంచి మేనేజర్ జె.పల్లవి పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అవగాహన

కంబాలచెరువు: ప్రపంచ హృదయ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా కళాశాల బయో టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో గుండె జబ్బులపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ దైనందిన జీవితంలో తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడికి లోనవుతూ గుండెపై పెనుభారం మోపుతున్నారన్నారు. ఫలితంగా 30 ఏళ్ల వారు కూడా గుండె సంబంధిత రోగాలకు గురవుతున్నారన్నారు. ప్రతీ ఒక్కరూ గుండెకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ బి.నాగేశ్వరి మాట్లాడుతూ సరైన వ్యాయామం చేయడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటం, సరిపడా నిద్రపోవడం, ఉల్లాసంగా గడపడం వంటి వాటితో గుండె పరిరక్షణ చేపట్టవచ్చన్నారు. కళాశాల బయోటెక్నాలజీ విద్యార్థులు హృదయ సంబంధిత వ్యాధులు, రక్షణపై తయారు చేసిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కె.అనూష, ఎ.పర్ణికసాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

జవాబుదారీతనంతో పౌర సేవలు

- వారం రోజుల్లో అర్హత కలిగిన ప్రతి అర్జీ పరిష్కారం
- ఎంపీ భరత్‌రామ్, కలెక్టర్ మాధవీలత
- రాజమహేంద్రవరం మండల స్థాయి జగనన్నకు చెబుదాంలో 45 వినతులు



జగనన్నకు చెబుదాంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్, కలెక్టర్ మాధవీలత, నేతలు డాక్టర్ శ్రీనివాస్, షర్మిలారెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు జిల్లాలో ప్రతి బుధ, శుక్రవారాల్లో నిర్వహిస్తున్నామని ఎంపీ మార్గాని భరత్ రామ్, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో రాజమహేంద్రవరం మండల స్థాయి జగనన్నకు చెబుదాం (జేకేసీ) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి 45 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధి తో పనిచేయాలనే లక్ష్యంతో జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కారం చేస్తున్నామన్నారు. మరింతగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండల స్థాయిలో జేకేసీ నిర్వహించామన్నారు. ఉన్నతాధికారుల సమక్షంలో జరిపిన ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ స్పందన, జేకేసీ ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేక సెల్ ద్వారా పర్యవేక్షిస్తున్నారన్నారు. అర్జీలలో నగరపాలక సంస్థ విభాగానికి- 27, రెవెన్యూ- 9, హోమ్ -3, మెడికల్, సచివాలయం, హౌసింగ్, పంచాయతీ, లేబర్, శిశు సంక్షేమ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అర్జీల పరిష్కార ప్రగతిని పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో మోనటరింగ్ విభాగం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారంలోగా పరిష్కారం కానీ వాటి విషయంలో సంబంధిత జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది వ్యక్తిగత బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ మాట్లాడుతూ జేకేసీలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్థిక పరమైన అంశాలతో కూడిన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని జేసీ సూచించారు. నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ మాట్లాడుతూ జేకేసీలో వచ్చిన అర్జీలను ఏడు రోజుల్లో పరిష్కరించేందుకు కార్యాచరణ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, సీపీఓ ఎ. ముఖలింగం , జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవ రావు, డీటీవో ఎస్.సత్యనారాయణ, డీఈఓ ఎస్. అబ్రహం, ఆర్డీవో కేవీ కృష్ణారావు, ఎల్డీఎం డీవీ ప్రసాద్, డ్వామా పీడీ పి.జగదాంబ, హౌసింగ్ పీడీ జి.పరశురామ్, డీఓహెచ్ఓ డాక్టర్ ఎస్టీజీ సత్యగోవింద్, డీసీహెచ్ ఓ డాక్టర్ ఎం.సనత్‌కుమారి, డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీపీఓ జేవీ సత్యనారాయణ, డీఎల్డీఓ పి.వీణాదేవి, డీఆర్‌డీఏ పి.డి ఎస్.సుభాషిణి, డీటీ డబ్ల్యూఓ కేఎస్ జ్యోతి, డీఎస్ఓ పి.విజయభాస్కర్, డీటీఓ సత్యనారాయణ, ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి. బాలశంకర్, ఆర్ఎంసీ అదనపు పీఎం సత్య వేణి, ఎస్ఈ జి.సాంబశివరావు పాల్గొన్నారు.

శ్రీనివాస్ వనంగా నామకరణం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: అటవీశాఖ అధికారుల నేతృత్వంలో నిర్వహిస్తున్న పుష్కరవనానికి కీర్తి చక్ర పందిళ్లపల్లి శ్రీనివాస్ వనంగా పేరు మార్పు చేయాలంటూ రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ జిల్లా కలెక్టర్ మాధవీలతకు లేఖ రాశారు. రాజమహేంద్రవరం నగరానికి చెందిన ఐఎఫ్ఎస్ అధికారి పందిళ్లపల్లి శ్రీనివాస్ తమిళనాడు ఫారెస్ట్ అధికారిగా పనిచేస్తున్న సమయంలో గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ చేతిలో హతమయ్యారని ఆయన సంస్మరణార్థం నవంబరు 10వ తేదీ వర్ధంతి సందర్భంగా ఫారెస్ట్ మెమోరియల్ డేగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అదే అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివాన్ చెరువులోని పుష్కర వనానికి కీర్తి చక్ర పందిళ్లపల్లి శ్రీనివాస్ వనంగా పేరును మార్పు చేయాలని కమిషనర్ లేఖలో కోరారు.